మాధ్యమిక దశ :

ఇది ఏడేళ్ళనుండి పన్నెండేళ్ళ వయస్సువరకు వుంటుంది. ఇది మానసికంగా కాస్త వికసించిన స్థితి. వాళ్ళంతట వాళ్ళుగా చిన్న చిన్న కష్టాల నెదుర్కొంటూ వుంటారు. ఇతర అభిప్రాయాల్ని, ఫీలింగ్స్‌ని గమనించడం మొదలుపెడ్తారు.

వాళ్ళ కంపెనీ చాలామటుకు సరదాగా ఆహ్లాదంగా వుంటుంది. ఎక్కువగా గొడవ చెయ్యకుండా, నెమ్మదిగా వుంటారు. కాని ఏ మాత్రం ఇబ్బంది కలిగించే సమస్యకైనా తల్లడిల్లిపోతారు. మనమేదైనా విషయాన్ని గురించి ఎక్కువగా చర్చిస్తే వాళ్ళు ఆసక్తి కనబర్చరు.

పైగా టాపిక్ మార్చడానికి ప్రయత్నిస్తారు. కష్టాల్ని, ఇబ్బందుల్ని తప్పించుకోవటానికి ప్రయత్నిస్తారు. ఎప్పుడు సాయంత్రమవుతుందని చూస్తూ వుంటారు. ఆటలు, పాటలు వారికి వినోదాన్ని కలిగిస్తాయి.

వాళ్ళ ఫీలింగ్స్‌ని అప్పుడు మాత్రమే బయటకు కనబరుస్తారు. టేప్ రికార్డర్లు, ఫోన్లు, బొమ్మలు, తోలుబొమ్మలు లాంటివి వారికి ఆలోచనా శక్తిని, వినోదాన్ని కూడా యిస్తాయి. కానీ, పెద్ద తార్కికంగా ఆలోచించే వయసు కాదు.

అప్పుడప్పుడూ పెద్దవాళ్ళేం చెప్తున్నారో వాళ్ళకి తెలీదు, అర్థంకాదు. అలాంటప్పుడు పెద్దవాళ్లే విసుక్కోకుండా ఆ వయసులో వాళ్ళ కర్థమయ్యేలా చెప్పాలి. (ఈ వయసులో నేను మా అమ్మమ్మ - తాతయ్య దగ్గర వుండేవాడిని. ఎవరింటికయినా వెళ్ళిరాగానే, "అక్కడ చాలా అల్లరి చేసేవురా" అనేది. మరుసటి సారి వెళ్ళినప్పుడు, మరింత కుదురుగా కూర్చుని వుండేవాడిని. అయినా, తిరిగొచ్చాక మళ్ళీ అదేమాట అనేది. నాకిప్పటికీ ఆమె అభిప్రాయం అర్థంకాలేదు. ఇప్పటికీ ఈ విషయమై ఆమెని ఆట పట్టిస్తూ వుంటాను)

పిల్లల విషయంలో పెద్దవాళ్ళు కాస్త పట్టు - విడుపులు చూపాలి. మరీ ఖచ్చితంగా వుండడం వల్ల ఇద్దరిమధ్యా దూరం పెరుగుతుంది. మన ఆలోచన్లని వాళ్ళమీద రుద్దకుండా, వాళ్ళ అభిప్రాయాల్ని కూడా తెల్సుకోవడం మంచిది.

ఎందుకంటే అది తెల్సుకోవడం వల్ల వాళ్ళకెలా నచ్చచెప్పాలో తేల్చుకోవచ్చు. అసలీ పిల్లల మనస్థత్వాల్ని గురించి మాట్లాడాలంటే, వాళ్ళో ప్రశ్నార్థకం అని చెప్పొచ్చు. వాళ్ళు ఒకే ప్రశ్నను చాలాసార్లు అడిగారని విసుక్కునే ముందు, ఏం సమస్యొచ్చి అన్నిసార్లలా అడుగుతున్నారా అని ఆలోచించాలి. వాళ్ళు చెప్తున్నది అర్థంకాకపోతే నెమ్మదిగా మళ్ళీ అడిగి తెల్సుకోవాలి.

సాధారణంగా ఏదైన సమస్యొచ్చినప్పుడు పిల్లలు ఏదో జబ్బును వంకగా పెట్టుకోవడం, ఇతరుల మీద నిందలేయడం, ఎవరిమీదో కోపం చూపించడం, లేదా ఫీలింగ్స్‌ని దాచుకోవడం లాంటివి చేస్తారు. అది హానికరంగా వుండనంతవరకూ ఫర్లేదు. కానీ ఎదుటివాళ్ళను

బాధపెట్టేలా వుంది అనుకుంటే మాత్రం అది నివారించడానికి ప్రయత్నించడం మంచిది.

మాధ్యమిక దశలో డిప్రెషన్ అన్నది భయంకరమైన జబ్బు.

ఇది చిన్నా, పెద్దా, ఆడా, మగా ప్రతి ఒక్కరికీ రావచ్చు. ముఖ్యంగా పసిపిల్లల్లో తల్లిదండ్రుల ప్రవర్తన వలన వస్తుంది. కానీ ఇది పెద్దగా బయటపడదు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలకు డిప్రెషన్ వుంది అన్న నిజాన్ని ఓ పట్టాన ఒప్పుకోరు.

డిప్రెషన్ వున్న పిల్లలు విషాదంగా, దిగులుగా, అసహనంగా వుంటారు. వాళ్ళు మాటల్లోనూ, చేతల్లోనూ ఏమీ చెప్పకపోయినా, తేలిగ్గా కనిపెట్టెయ్యొచ్చు. దేంట్లోను ఆసక్తిగా పాల్గొనరు, దేనిమీద ఇష్టం వుండదు.

ఈ డిప్రెషన్ ఫలితంగా ఆరోగ్యం కూడా దెబ్బతినొచ్చు. తల నొప్పులు, కడుపు నొప్పులు, తిండి, నిద్ర మీదా ఆనసక్తి లాంటివి రావచ్చు. అసంతృప్తిగా కన్పిస్తారు. ఏదీ వీళ్ళకు పెద్ద ఆనందానివ్వదు. తొందరగా చిరాకు పడతారు. తామెందుకు బాధపడుతున్నారో వాళ్ళకే తెలియదు.

ఇంకో విధమైన పిల్లలు డిప్రెషన్‌గావున్నప్పుడు మరింతగా అల్లరి చేస్తారు. ఎదుటివాళ్ళను రెచ్చగొట్టి కోపం తెప్పించి శాంత పడతారు. డిప్రెషన్‌ని కనబర్చే విషయంలో పెద్దవాళ్ళకేం తీసిపోయి, కోపం, చిరాకు ఎదురుచెప్పడంలాంటి స్థాయీ భావాలు ప్రకటిస్తారు. తల్లిదండ్రుల మధ్య గొడవలున్నప్పుడు, ఇంట్లో చెలరేగే అశాంతివల్ల పిలలు పక్క తడపడం, స్నేహితులతో పోట్లాడ్డం, చదువులో మందగించడం, అతిశయోక్తులు చెప్పడం, తల్లిదండ్రులకు దగ్గరవ్వాలని ప్రయత్నించడం లాంటివి చేస్తారు.

వయస్సు పెరిగేకొద్దీ, వారు డిప్రెషన్ కనబర్చే విధానాలు మారుతూ వుంటాయి. డిప్రెషన్‌కి ముఖ్య కారణాలు ఏమిటంటే, 1. ఏదో శారీరక లోపం వుండడం. 2. ప్రేమ కొరత కావడం. 3. ఏం సాధించినా మెచ్చుకోలు లేకపోవడం. 4. ఆత్మీయులెవరో చనిపోవడం. 5. తల్లిదండ్రులు విడిపోవడం, లేదా పట్టించుకోకపోవడం లేదా తమ తోబుట్టువులమీద ఎక్కువ ప్రేమ చూపడం, 6. బీదరికం. 7. కొత్త ప్రదేశాల్లో ఇమడలేకపోవడం, 8. చేయని తప్పుకి శిక్ష అనుభవించాల్సి రావడం, 9. అన్నిటికన్నా ముఖ్యం ప్రేమ విఫలమవటం!

డిప్రెషన్సని అణచివేయడం వల్ల ఎలాంటి లాభం వుండదు. దీనివల్ల భవిష్యత్తులో పెద్ద ఇబ్బందులు యెదుర్కోవాల్సి వస్తుంది. అందుకే పెద్దవాళ్ళు తమ పిల్లల్ని మనస్సులో ఏదీ దాచుకోకుండా వున్నదున్నట్లు చెప్పేందుకు సహకరించాలి. వారు బాధపడుతూంటే, ఓదార్చే బదులు, వాళ్ళను వాళ్ళకే వదిలివేయాలి. దీనివల్ల ఇలాంటి సమస్యల్ని తమంతట తాము పరిష్కరించుకునే స్థితికి వారెదుగుతారు.

వాళ్ళో కొత్త వ్యాపకమో, కొత్త ఆటో, కొత్త హాబీయో, కొత్త ప్రదేశం వెళ్లడమో లాంటి వాట్లో తమకు తాము నిమగ్నమయ్యేలా చూడాలి. దీనివల్ల వాళ్ళు తమ బాధను కొంతవరకు

మర్చిపోగలరు. వాటిల్లో ఏదైనా విజయం సాధించేందుకు సహకరించడం వల్ల మనం వాళ్ళ బాధనుండి పూర్తిగా విముక్తుల్ని చేయగలం. ఎందుకంటే కొత్తగా సాధించిన విజయం వాళ్ళలో ఆత్మవిశ్వాసాన్ని, ఉత్తేజాన్ని కలుగజేస్తుంది. ఇంట్లో ఓ కొత్త వంటకం చేయడం, లేదా హోటల్‌కి తీస్కెళ్ళడంలాంటి చిన్న చిన్న పనులతో కూడా వాళ్ళలోని డిప్రెషన్‌ని కాస్త తగ్గించవచ్చు.

పిల్లలు చెప్తున్న విషయాన్ని యెటువంటి విమర్శలూ, తీర్పులూ లేకుండా సహనంగా, సానుభూతిగా వినాలి. వారికా టైంలో మన సహకారం చాలా అవసరం. వారా వయస్సులో తమ సమస్యల్ని తామే పరిష్కరించగలిగే స్థితికి చేరుకోగలిగితే భవిష్యత్తులో ఎంత క్లిష్టపరిస్థితులైనా ఎదుర్కోగలరు. దీంట్లో పెద్దవాళ్ళ పాత్ర ఎంతైనా వుంది.

మూడవ దశ :

దీన్నే 'అడాలసెన్స్' అని కూడా అంటారు. ఈ దశ పధ్నాలుగేళ్ళ నుండి పందొమ్మిదేళ్ళ వరకు వుంటుంది. (కొంతమంది అరవై ఏళ్ళు వచ్చినా పోదు. అది వేరే సంగతి) ఈ వయస్సులో ఒక్కోసారి ఎంత చురుగ్గా వుంటారో, అంత మందకొడిగానూ వుంటారు. ఎంత చిన విషయానికైనా ఎంత పెద్దగా నవ్వుతారో, అంత చిన్న బాధకే పెద్దగా ఏడవనూ గలరు.

వీళ్ళ మనస్తత్వం ఎప్పుడూ విపరీతంగానే వుంటుంది. ఒకే సారి ఆనందపు శిఖరాలెక్కి, ఆవేదనల అగాధాల్లోకి పడిపోగలరు. అందుకే ఈ దశను 'టైం ఆఫ్ స్ట్రెస్ అండ్ స్టార్మ్ అండ్ గ్రోత్' అంటారు. మొత్తానికి ఇదో సంక్లిష్ట దశ. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సులు రావడానికి, ఆత్మన్యూనతా భావానికి ఇదో సరయిన టైం. మానసికంగా చాలా సున్నితమైన స్థితిలో వుంటారు.

ఈ వయసులో వాళ్ళు గుర్తింపుని కోరుకుంటారు.

అది దొరక్కపోతే ఆత్మన్యూనతా భావాన్ని పెంచుకుంటారు. ప్రస్తుతం ఈ తరం టీనేజ్ మరీ విపరీతమైన టెన్షన్ వాతావరణంలో పెరుగుతోంది. సెక్స్, వయోలెన్స్, దిగజారిన నైతిక విలువలు ప్రబలిపోతున్న వాతావరణంలో పెరుగుతున్న వాళ్ళు అయోమయంలో కొట్టుకుపోతున్నారు.

దీనికి తోడు పట్టించుకోని తల్లిదండ్రులు, మంచి, చెడు నేర్పే సత్తాలేని ఉపాధ్యాయులు, డ్రగ్స్, వెస్ట్రన్ కల్చర్, తాగుడు, ప్రమాదకరమయిన సెక్స్ నుంచి పిల్లల్ని కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులకు కత్తిమీద సాములాంటిది. ఈ తరం ముఖ్యంగా రేపటిమీదా, ఆశయాలమీద నిరాసక్తతతో కృంగిపోతున్నారు.

స్పీడు యుగం, యుద్ధాలు, మారణహోమాలు, బాంబులు, కాలుష్యాలు, రాజకీయాలు, నిరుద్యోగాలు లాంటి సమస్యల్ని తప్పించుకోవడానికి క్షణికానందాలు వెదుక్కుంటున్నారు.

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యవిషయమేమిటంటే ఎప్పుడో భవిష్యత్తుల్లో రాబోయే సమస్యల నుంచి తప్పించుకోవడానికి యిప్పుడు సమస్యలు సృష్టించుకుంటున్నారని.

దీనికి వాళ్ళను తప్పుపట్టే బదులు, మనం మొత్తం సిస్టమ్‌నే సమీక్షించాలి. చాలామంది యింట్లో సరయిన వాతావరణం వుండదు. నాలుగు కాలాలపాటు చల్లగా నిలిచే పెళ్ళిళ్ళు చాలా తక్కువ. ఇది వాళ్ళలో డిప్రెషన్‌ని కలిగిస్తుంది. అంతేకాదు, ఈ తరంవాళ్ళకి తమ పూర్వీకుల్లా పెద్ద కష్టపడాల్సిన పనిలేదు.

మైళ్ళ తరబడి నడిచివెళ్ళి చదువుకునే అవసరం లేదు. అన్ని దురలవాట్లూ అందుబాట్లో వుంటాయి. మన పూర్వీకులు అతి కష్టం మీద సాధించిన స్వాతంత్ర్యం విలువ తెలీదు. నిరాశా నిస్పృహల్ని, భ్రమల్ని ఎలా ఎదుర్కోవాలో తెలీదు...... అందుకే ప్రతి చిన్న విషయమూ సమస్యలా కనిపిస్తుంది. ప్రతిదానికి ఇన్‌స్టెంట్ జవాబులు వెతుకుతారు. డ్రగ్స్‌లాంటి వాటికి అలవాటు పడతారు.

ఈ టీనేజ్ వయసు బాల్యానికి, పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఓ వారధిలాంటిది. గుర్తింపుకోసం పాకులాట ఇక్కడ్నుంచే మొదలవుతుంది. జీవితంలో 'ఫలానా' అవడానికి ఇక్కడ్నుంచే కృషి, ట్రైనింగ్ మొదలవుతుంది. ఇవన్నీ సరిగ్గా జరిగితే మంచి భవిష్యత్తు వుంటుంది. కానీ యివి సధించడానికి చేసే కృషిలోనే రకరకాల సమస్యలెదురవుతాయి. చిన్న వాళ్ళు నిర్ణయాల విషయంలో స్వతంత్రంగా ప్రవర్తించాలని చూస్తారు. గొడవలు మొదలవుతాయి.

ఈ దశలో ఈ నూనూగు మీసాల యువకులు స్నేహితులతోనూ, తమ వయసువారితోనూ ఎక్కువ సమయం గడపడానికి ఇష్టపడతారు. ఎదుటివాళ్ళ సలహాలూ, విమర్శలూ వినడానికి ఇష్టపడతారు. సెల్ఫ్‌సెంటర్డ్‌గా ఆలోచించడం మొదలుపెడతారు. నమ్మదగ్గ స్నేహితులతో గాఢంగా అల్లుకుపోతారు. తమ నెవ్వరైనా పట్టించుకోకపోవడం, గుర్తించకపోవడం, మెచ్చుకోకపోవడం లాంటివి వారిని భయపెడతాయి.

తల్లిదండ్రులు ఈ మార్పులన్నిటినీ సహజమేనని గుర్తించి చాలా జాగ్రత్తగా, తగు విధంగా ప్రవర్తించాలి. లేదా వారు ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం లేని అసమర్ధులుగా తయారయ్యే ప్రమాదం వుంది.

టీనేజ్ మొదట్లో...... అంటే పదమూడేళ్ళ నుంచి పదహారేళ్ళ కాలం వరకు డిప్రెషన్ కాస్త వేరుగా వుంటుంది. విమర్శలకు వారు తీవ్రంగా స్పందిస్తారు. ఎవ్వరి గురించి ఆత్రుత చూడరు, బాధపడరు. ఆలోచించడం కంటే వాళ్ళేదయినా చేయడంపట్ల ఆసక్తి చూపుతారు. డిప్రెషన్‌ని ఏదో విధంగా బయటకు కనపర్చాలని ప్రయత్నిస్తారు.

ఎంత విశ్రాంతి తీసుకున్నా వెంటనే అలసిపోతారు. ఏ విషయంలోనూ ఏకాగ్రత చూపలేకపోవడం, ఈ లక్షణాలు ఏ మోతాదులో కన్పించినా, అది డిప్రెషన్‌కే సంకేతం. బోర్‌గా, రెస్ట్‌లెస్‌గా కన్పిస్తారు. ఏదైనా మంచి వ్యాపకంలో వాళ్ళను బిజీచేయడం వల్ల

డిప్రెషన్‌ని చాలవరకు పోగొట్టవచ్చు.

ఎందుకంటే వాళ్ళ మనసులు చాలా లేతవి. ఎటొచ్చీ, ఆ వ్యాపకాలు కూడా వాళ్ళకు బోర్ కొట్టకుండా చూస్కోవాలి. కొంతమంది ఒంటరితనమంటే విపరీతంగా భయపడుతూ వుంటారు. తమకోసం సమయం, ఓర్పు వెచ్చించే వాళ్ళంటే మొగ్గు చూపుతారు. దాంట్లోనే చాలా సమయం వృధా చేసి, చదువు, ఆటలు, అలక్ష్యం చేసి ఎటూ కాకుండా పోతారు. మరికొంత మంది పూర్తి ఒంటరితనాన్ని కోరుకుంటారు. తాము చేయగల ఏ పని మీదైనా ఎక్కువగా ఉత్సాహం, తెలివితేటలు చూపి మంచి విజయాలు సాధిస్తారు.

కొంతమంది టీనేజర్స్ ఎప్పుడూ ఎవరివో సహాయ సహకారాల కోసం ఎదురుచూస్తుంటారు. అవి దొరకనప్పుడు కోపం, చిరాకు ప్రదర్శించడం, పారిపోవడం, దొంగిలించడం లాంటి విపరీతమైన, సంఘవిద్రోహ చర్యలు చేస్తుంటారు.

ఇలాంటివి చేయడం వల్ల ఏదో సాధించామన్న ఫీలింగ్ ఇచ్చే సంతృప్తితో వీరు తమ సమస్యల్ని మర్చిపోవడానికి ప్రయత్నిస్తారు. దీనికి మెచ్చుకోలు లభిస్తే మరింతగా రెచ్చిపోతారు. ఎప్పుడో ఒకసారి పెద్ద దెబ్బతింటారు.

పదహారేళ్ళనుండి, పంథొమ్మిదేళ్లవరకు వుండే పిల్లలు తమ డిప్రెషన్‌ని నేరుగా ప్రదర్శిస్తారు. డ్రగ్స్‌కి అలవాటుపడడం, సెక్స్ కోసం ప్రాకులాడ్డం, ఆత్మహత్యా ప్రయత్నాలు చేయడం, ఒంటరితనంతో గడపడం, అందరికీ దూరంగా మసలడం లాంటివి చేస్తారు. ఏదో ప్రపంచ మంతా తమ మీద కక్షకట్టినట్టు, తమనర్ధం చేసుకునేవారూ, ప్రేమించేవారూ, ఆదరించేవారూ ఎవరూ లేనట్టు తమమీద తామే జాలి పెంచుకుని, అది అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలకు పూనుకుంటారు. ఈ స్థితిలోనే అవతలి సెక్స్ నుంచి రికగ్నిషన్ రాగానే అది ప్రేమ అన్న భావంతో, ఒక 'మధురమైన' బాధలో పడిపోతారు. ఇదంతా స్వాభావసిద్దమే. అయితే ఈ ప్రేమలోంచి ప్రేరణ పొందాలే తప్ప డిప్రెస్ అవకూడదు అని గ్రహించాలి. (దీనిని గురించి వివరంగా 'లేడీస్ హాస్టల్' అన్న నవలలో వ్రాశాను.)

అడాలసెంట్స్‌ని అర్ధం చేసుకోవడం :

ఇది అన్నింటికైనా కష్టమైన పని. ఈ దశలో వున్న స్ట్రెస్, స్ట్రెయిన్ మరే దశలోనూ అంతగా కన్పించవు. యూనివర్సిటీ క్యాంపస్‌లలోనూ, హాస్పిటల్లోనూ, స్కిజోఫ్రీనియా జబ్బుతో బాధపడేవాళ్ళలోనూ ఇది కన్పించిపోతూ వుంటుంది.

సంఘంలోని కట్టుబాట్లకు ఎప్పుడూ రెబెల్లియస్‌గా పోట్లాడేవాళ్ళు అడాలసెంట్సే అయ్యుంటారు. వారి భాష, ప్రవర్తిన ఎంత తేడాగా ఉంటుందంటే అసలు వాళ్ళు బ్రతికేది వేరే ప్రపంచంనేమో అనే భావన మనకు కలుగుతుంది. తల్లిదండ్రులు, వాళ్ళతో మెలిగే ఇతర పెద్దవాళ్ళు, వాళ్ళను సరిగా అర్ధం చేసుకోలేక తలక్రిందులైపోతూ వుంటారు.

వీరికి, పెద్దవాళ్ళకి మధ్యవున్న తేడానే 'జనరేషన్ గ్యాప్' అంటారు. జనరేషన్ గ్యాప్ అన్నది ఎందుకు వస్తుందో ఎలాంటి పరిస్థితుల్ని ఈ అడాలసెంట్స్ ఎదుర్కొంటారో తెల్సుకోవడం చాలా అవసరం. ఈ అడాలసెంట్స్ ఎదుర్కొనే సమస్యల్ని తెల్సుకునే ముందు, వారికా దశలో ఏమేమి జరుగుతూ వుంటుందో తెల్సుకోవాలి.

అడాలసెంట్స్ అంటే అడల్ట్‌కి బాల్యానికి మధ్య వుండే దశ. ఈ దశ మొదలయ్యేముందు, చిన్నపిల్లల మనస్తత్వం వుంటుంది. అంతమయ్యే సరికి పెద్దవాళ్ళయిపోతారు. ఈ దశలోనే అతిముఖ్య మైన శారీరక, మానసిక మార్పులు కలుగుతాయి. ఇవన్నీ కూడా వారి ప్రాబ్లమ్స్‌కి కారణాలవుతాయి.

పెద్దవాళ్ళు, ముఖ్యంగా తల్లిదండ్రులూ, టీచర్లు వారి మనస్థత్వాలు ఆలోచనా విధానం, వీరి అశాంతికి తోర్పడతాయి. పెద్దవాళ్ళలా వీరి నొకో సారి చిన్నపిల్లలగానూ, మరొకోసారి పెద్దవాళ్ళలా బాధ్యతాయుతంగానూ ప్రవర్తించాలని కోరుకుంటారు. ఇది అడాలసెంట్స్‌ని అయోమయంలో పడేస్తూ వుంటుంది. తమ చిన్నపిల్లవాడో, పెద్దవాడో ఆ కుర్రాడికి అర్ధంకాదు.

చుట్టూవున్న స్నేహబృందం కూడా వీరిని, వీరి తల్లిదండ్రులకి మధ్య గొడవలు ఉత్పన్నమవడానికి తోర్పడతారు. తాము మరింత స్వతంత్రంగా, స్వేచ్ఛగా బ్రతకగలగాలని వీరు కోరుకుంటారు. ఇంట్లో వాళ్ళకంటే స్నేహితుల మీద ఎక్కువ ఆసక్తిని చూపిస్తారు. ముఖ్యంగా అపోజిట్ సెక్స్ వైపు మొగ్గుతారు.

ఇంట్లో కంటే బయట సమయం గడిపేయడానికి ఎక్కువ ఇష్టపడతారు. ఇది తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తుంది. పిల్లవాడు చేయి దాటి పోతున్నాడని వారి బాధ. చుట్టూవున్న సమస్యలూ, సాంఘిక పరిస్థితి వీరి ప్రాబ్లమ్స్‌కి దోహదపడే మరో కారణం.